# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

**Bullet Edition**

బుధవారం 19 నవంబరు | www.prajaswaramdaily.com | 4 pm


# పట్టపర్తిలో మహత్తు ఉంది

## బాబా బోధనలు లక్షల మందికి మార్గం .. ప్రధాని మోదీ

ఆంధ్ర పుట్టపర్తిలో సత్యసాయి జయంత్యుత్సవాలు

**హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్**



భగవాన్ శ్రీ సత్యసాయి బాబా పేరుతో రూ.100 నాణేలు, పోస్టల్ స్టాంపులు విడుదల చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు.

అమరావతి, ప్రజాస్వరం: ఆంధ్ర.. పుట్టపర్తి పవిత్ర భూమి.. ఇక్కడ ఏదొక మహత్తు ఉందని ప్రధాని మోదీ అన్నారు సత్యసాయిజయంత్యుత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని అన్నారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. "బాబా బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు'.. ఇదే ఆయన నినాదం. చాలా మంది జీవితాలను సత్యసాయి సమూలంగా మార్చేశారు. లక్షల మందిని సేవామార్గంలో నడిపించారు. ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారు. పుట్టపర్తి పవిత్ర భూమిలో ఏదో మహత్తు ఉంది. సత్యసాయి సంస్థలన్నీ ఇలాగే ప్రేమను పంచుతూ వర్ధిల్లాలి" అని మోదీ అన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. భౌతికంగా బాబా లేకున్నా... ఆయన ప్రేమ మనతోనే ఉంది. సత్యసాయి బోధనల ప్రభావం దేశమంతా కనిపిస్తోంది. కోట్ల మంది ఆయన భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ప్రేమ సూత్రాలు ఎందరినో ఆలోచింపజేశాయి అని పేర్కొన్నారు. అంతకు ముందు సత్యసాయి జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డలకు కోటి చీరలు

## సీఎం రేవంత్ - ఇందిరమ్మ చీరల పంపిణీ

**నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు కొనసాగింపు**

**మార్చి 1 నుంచి 8 వరకు రెండో విడత**

**కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, మంత్రులు**

హైదరాబాద్, ప్రజాస్వరం: ఇందిరమ్మ చీరల పంపిణీని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు మహిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా అంతకుముందు నెక్లెస్ రోడ్‌లో ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం (డిసెంబరు 9) నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) వరకు పట్టణ ప్రాంతాల్లో అందజేయనున్నారు.

దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడిన సమయంలో ఇందిరా గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆమె అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఎంతో కృషి చేశారు అని తెలిపారు. అయితే ఇందిరమ్మ ప్రధానిగా పనిచేసినప్పుడు బ్యాంకుల జాతీయ కరణ, అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తెచ్చి పేదలకు భూములు పంచినా, పేదలకు ఇండ్లు కట్టించినా అది ఒక్క ఇందిరమ్మకే సాధ్యమైంది. అంతేకాకుండా పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో ధీటుగా నిలబడి ఎదుర్కొన్న ధీశాలి ఇందిరమ్మ.. దేశానికి బలమైన నాయకత్వం అందించిన ఘనత ఇందిరాగాంధీ గారిది. ఇప్పుడు ఇందిరమ్మ స్ఫూర్తితోనే మా ప్రభుత్వం ముందుకు వెళుతోంది అని సీఎం పేర్కొన్నారు.. ప్రస్తుతం మా కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెట్రోల్ బంక్‌లు నిర్వహించుకునేలా ప్రోత్సహించాం.. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలని యజమానులను చేశాం.. మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం.. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం.. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం అని తెలిపారు. అలాగే కాంగ్రెస్ కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులని చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరపున సారె పెట్టి గౌరవించాలని భావించాం.. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం అని తెలిపారు.

## ప్రజల్ని జడ్జ్ చేయొద్దు .. అర్థం చేసుకోవాలి

**ఇది సత్యసాయి చెప్పిన మాట**

**క్రికెట్ దిగ్గజం సచిన్**



పుట్టపర్తి: అప్పట్లో సత్య సాయిబాబా ఫోన్ చేసిన అనంతరం ఒక పుస్తకం పంపారు. అది నాకు సానుకూల దృక్పథాన్ని, స్ఫూర్తిని ఇచ్చింది. మేం ఆ సంవత్సరం ట్రోఫీ కూడా గెలుచుకున్నాం. అది నాకు గోల్డెన్ మూమెంట్" అని సచిన్ తెలిపారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు.
ప్రజల్ని జడ్జ్ చేయొద్దని.. వారిని అర్థం చేసుకోవాలని సత్యసాయి చెప్పేవారని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అన్నారు. దీని వల్ల చాలా సమస్యలు తొలగిపోతాయని చెప్పారు. "ప్రజలకు సేవ చేయడమే సత్యసాయి లక్ష్యంగా పెట్టుకునేవారు. వారి ఉన్నతికి కృషి చేశారు. శారీరక ఆరోగ్యంతో మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యం. సత్యసాయి ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనం అందించేందుకు పాటుపడ్డారు. బలహీన వర్గాలకు సాయం చేయడమే నిజమైన గెలుపు. సత్యసాయిని కలిసిన ఎవరికైనా ఈ విషయం అర్థమయ్యేది. 2011 వరల్డ్‌కప్‌లో నేను ఆడినప్పుడు భావోద్వేగాలు అధికంగా ఉండేవి. అప్పుడు బెంగళూరులో ఉన్నాం.

## ఆత్మాహుతి దాడికి ముందే వీడియో చిత్రీకరణ

**తన ఫోన్‌ను పుల్వామాలోని సోదరుడికి ఇచ్చిన ఉగ్రవాది నబీ**

**భయంతో ఫోన్‌ను చెరువులో పడేసిన సోదరుడు**

ఢిల్లీ, ప్రజాస్వరం: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ మహమ్మద్ అలియాస్ నబీకి సంబంధించిన వీడియోపై కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతను ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ రికార్డ్ చేసిన వీడియో ఘటన జరగడానికి కనీసం వారం రోజుల ముందే చిత్రీకరించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ వివరాలను జాతీయ మీడియా తన కథనంలో పేర్కొంది. ఆ వీడియో ఉన్న ఫోన్‌ను నబీ తన సోదరుడికి ఇవ్వగా, అతను భయంతో దాన్ని ఓ చెరువులో పడేసినట్లు తేలింది.

నవంబర్ 10న కారు బాంబు దాడికి పాల్పడటానికి వారం ముందు, నబీ జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో ఉన్న తన ఇంటికి వెళ్లాడు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అతడు, తిరిగి వెళ్లే ముందు తన రెండు ఫోన్లలో ఒకదాన్ని తన సోదరుడికి ఇచ్చాడు. అయితే, నబీ సహోద్యోగులైన డాక్టర్ ఆదిల్ అహ్మద్, డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షహీన్ సయీద్‌లను ఉగ్రవాద సంబంధిత ఆరోపణలపై పోలీసులు వరుసగా అరెస్ట్ చేయడంతో నబీ సోదరుడు భయాందోళనలకు గురయ్యాడు. తన అన్న కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారని తెలియడంతో, ఆ ఫోన్‌ను ఇంటి దగ్గర్లోని చెరువులో పడేశాడు. నబీకి చెందిన రెండు ఫోన్ల సిగ్నల్స్ ట్రేస్ చేయగా, ఒకటి ఢిల్లీలో, మరొకటి పుల్వామాలో స్విచ్ ఆఫ్ అయినట్లు అధికారులు గుర్తించారు. పుల్వామాలోని నబీ ఇంటికి చేరుకుని అతని సోదరుడిని విచారించగా అసలు విషయం బయటపడింది.




# మరో ఎన్‌కౌంటర్

**ఏడుగురు మావోయిస్టులు మృతి**

అమరావతి ,ప్రజాస్వరం: ఆంధ్రా - ఒడిశా అటవీ ప్రాంతంలో ఇవాళ మరో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఆరు నుంచి ఏడు మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌ను ఏపీ ఇంటిలిజెన్స్ చీఫ్ ధృవీకరించారు. మరోసారి ఆంధ్రా - ఒడిశా సరిహద్దుల్లోని రంపచోడవరం అటవీ ప్రాంతంలో కాల్పులు జరిగాయి. ఇదే విషయాన్ని ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా ధ్రువీకరించారు. ఇవాళ విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా మాట్లాడారు. ఇవాళ జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు మృతి చెందినట్లు సమాచారం ఉందని తెలిపారు. అయితే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

**50 మంది అరెస్ట్ - ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్**

నవంబరు 17వ తేదీన ఒక ఆపరేషన్ లాంచ్ చేశామని%ా% నవంబర్ 18వ తేదీన ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయని తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ఏపీలోకి రావటానికి మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరిగిన మావోయిస్టుల అరెస్టులపై స్పందిస్తూ మొత్తం 50 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. వీరిలో ప్లాటూన్ మెంబర్లు,డివిజనల్ కమిటీ మెంబర్స్,ఏరియా కమిటీ మెంబర్స్ ఉన్నారని వివరించారు.

# అడవుల్లో నక్సల్స్.. పదవుల్లో అర్బన్ నక్సల్స్


**అమిత్‌షాది మాటంటే మాటే.. మార్చిలోపు మావోయిజం అంతం**

**కేంద్రమంత్రి బండి సంజయ్**

హుజూరాబాద్, ప్రజాస్వరం: నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే.. అర్బన్ నక్సల్స్ పదవులు అనుభవిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. హుజూరాబాద్ పర్యటనలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమాయక నక్సలైట్లను రెచ్చగొట్టి వాళ్ల చావులకు కారకులయ్యారని విమర్శించారు. "నక్సలైట్లు చనిపోతే వాళ్ల తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల గుండెకోత మీకేం తెలుసు? నక్సలైట్ల తుపాకీని సమర్థించిన వారు కూడా నేరస్థులే. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాది మాటంటే మాటే. మార్చిలోపు మావోయిజాన్ని పూర్తిగా అంతమొందిస్తాం"అని బండి సంజయ్ అన్నారు.




# భద్రాచలం.. "చక్కెర పొంగలి" వివాదం



భద్రాచలం, ప్రజాస్వరం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మంగళవారం చక్కెర పొంగలి అక్రమంగా తరలిపోతుందంటూ హడావుడి చోటు చేసుకుంది. దీంతో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. అంతా పద్ధతి ప్రకారమే జరుగుతుందంటూ తూకం వేసి నిర్ధారించారు. వార్షికంగా అన్ని విభాగాల నుంచి సుమారు రూ.80 కోట్ల మేర ఆదాయం రాములవారికి వస్తుండగా ఇందులో ప్రసాదాల ద్వారానే సుమారు రూ.8 కోట్ల లావాదేవీలు సాగుతుండటంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం పట్టణానికి చెందిన భక్తులు 5 కిలోల చక్కెర పొంగలి తయారు చేయించి తీసుకెళ్తున్న క్రమంలో భద్రతా సిబ్బంది ఆపి తనిఖీ చేశారు. తూకం వేయడంతో 32 కిలోల బరువు వచ్చింది. సదరు భక్తులు తాము నిబంధనల ప్రకారం కిలోకి రూ.400 చొప్పున రూ.2 వేలు చెల్లించామని చెప్పడంతో ఆ భక్తులకు ఇబ్బంది ఉండకూడదని భావించిన అధికారులు వారిని ప్రసాదంతో పాటు పంపించారు. ఐదు కిలోల దిట్టానికి అంత చక్కెర పొంగలి రావడం ఏమిటని అయోమయం నెలకొనడంతో ఈఓ దామోదర్ రావు చొరవ తీసుకుని మరోసారి భద్రతా సిబ్బంది సమక్షంలో ఐదు కిలోల చక్కెర పొంగలి తయారు చేసి తూకం వేయగా అది 36 కిలోలు ఉన్నట్లు గుర్తించారు.

# ఒకరి అరెస్ట్ తో నేరాలు ఆగవు

**హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సీవీ ఆనంద్**



హైదరాబాద్, ప్రజాస్వరం: పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి అరెస్ట్ కావడంతో పైరసీకి అడ్డుకట్ట పడినట్లేనని చాలామంది భావిస్తున్నారని తెలంగాణ హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ అరెస్ట్‌తో సైబర్ నేరాలు ఆగిపోతాయా అనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఒకరిని అరెస్ట్ చేసినంత మాత్రాన సైబర్ నేరాలు లేదా పైరసీ పూర్తిగా ఆగిపోతాయని అనుకోవడం అసాధ్యమని స్పష్టం చేశారు. "హ్యాకర్లు, హ్యాకింగ్ అనేవి నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. ఒకడు పోతే మరొకడు వస్తాడు, వాడు కూడా మరింత అధునాతన టెక్నాలజీతో నేరాలకు పాల్పడతాడు" అని పేర్కొన్నారు. ఇలాంటి నేరాల నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి నివారణ ఒక్కటే మార్గమని హితవు పలికారు.